ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
ఆదివారం 21 జూలై 2024



ఆర్.కొంతలపాడులో ఉల్లినారు పనుల్లో కూలీలు

# పల్లెటూర్లు..!







కర్నూలు మండలం జి.సింగవరం గ్రామం పొలాల్లో ఉల్లి నాటు పనుల్లో కూలీలు, రైతులు బిజీ

- కళకళలాడుతున్న గ్రామసీమలు
- వర్షాలకు వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ
- ఉల్లినాట్లు వేస్తున్న కూలీలు

కర్నూలు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కరువు ఛాయలకు నిలయమైన కందనవోలు ముంగిట పల్లె'టూర్లు' పచ్చని అందాలను తలపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా కనిపిస్తున్నారు. పత్తి పొలాల్లో ఎరువులు వేస్తూ.. పొలాల్లో ఉల్లినారు నాటుతూ సందడిగా కనిపిస్తున్నారు. శుక్ర,శనివారాల్లో కర్నూలు మండలం ఆర్.కొంతలపాడు, జి.సింగవరం, సుంకేసులు, ఆర్‌కే దుద్యాల, ఎదురూరు, తులిశాపురం తదితర గ్రామాల్లో ఎటు చూసినా పెద్ద సంఖ్యలో ఉల్లినారు నాటుతున్నారు. పల్లెసుద్దులు, జానపదాలతో పంట పొలాల్లో పనులు చేస్తున్న రైతులు, మహిళా కూలీలతో మైమరిపిస్తున్న పల్లెసీమలను చూసి ఆహా..! అనిపించక మానదు. ఆ గ్రామాలకు చెంతనే ఉన్న సుంకేసుల జలాశయం అందాలు వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రకృతి ప్రేమికులు తరలివచ్చారు. సెల్ఫీలు దిగుతూ జలాశయం అందాలను ఆస్వాదించారు. ఆ సమయంలో ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు.. జలాశయంపై వర్షించడానికి సిద్ధమన్నట్టుగా కనిపించాయి. ఆ దృశ్యాలను సెల్‌ఫోన్లలో ప్రకృతి ప్రేమికులు బంధించారు



హంద్రీనీవా పత్తికొండ రిజర్వాయర్ కుడి కాలువ దుస్థితి

# అలా ముగించారు..!

కర్నూలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

ఐఏబీ.. అంటే సాగునీటి సలహా మండలి. ఏడాదికి రెండు పర్యాయాలు జరిగే ఐఏబీ సమావేశాల్లో జలాశయాలలో చేరుతున్న వరద లభ్యత ఆధారంగా ఎన్ని ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇస్తారో కీలక నిర్ణయం తీసుకోవాలి. ప్రాజెక్టుల వారిగా ఉన్న సమస్యలపై పూర్తిగా చర్చించాలి. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల సలహాలు సూచనలు తీసుకోవాలి. కాలువల మరమ్మతులు, ఆధునికీకరణ, కొత్త ప్రాజెక్టులపై చర్చించాలి. వాస్తవాలతో ప్రభుత్వానికి నివేదిక పంపాలి. శుక్రవారం కలెక్టరు పి. రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగిన ఐఏబీ సమావేశం ప్రాజెక్టుల వారిగా తాజా పరిస్థితిపై చర్చ జరగకుండానే.. ఆయా ప్రాజెక్టుల వారిగా నీటి లభ్యతను బట్టి సాగునీరు ఇస్తాం..! అంటూ ఏకవాక తీర్మానంతో ముగించారు. కలెక్టరు కొత్తగా వచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కొత్తగా ఎంపికయ్యారు. వారికి తొలి ఐఏబీ సమావేశం ఇది. సాగునీటి వనరులపై వారికి అవగాహన కల్పించి.. సలహాలు, సూచనలు తీసుకోవాల్సిన ఇంజనీర్లు వారిని తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### గురురాఘవేంద్ర లిఫ్టుల మరమ్మతులపై చర్చేదీ..?

మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) నుంచి సాగునీరు అందని సమయంలో అరుతడి పంటలకు సాగునీరు ఇచ్చి (సప్లిమెంట్) పంటను కాపాడాలని గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం లక్ష్యమని ఇంజనీర్లు చెబుతున్నారు. జీఆర్‌పీ పరిధిలో స్టేజ్-1 లిఫ్టులు 7, స్టేజ్-2 లిఫ్టులు 8 కలిపి 12 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. విద్యుత్ బిల్లులు, మరమ్మతులు, నిర్వహణ సిబ్బంది జీతాలు కోసం ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ (ఓ అండ్ ఎం) కింద ఏటేటా ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. రెండేళ్ల కిత్రమే రూ.15 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. తాజాగా రూ.18-20 కోట్లకు చేరింది. విద్యుత్ పంపులు చెడిపోతే రైతులు చందాలు వేసుకొని మరమ్మతులు చేసుకోవాల్సిన దైన్యపరిస్థితి ఉంది. సప్లిమెంట్ అనే నిబంధన తొలగించి తుంగభద్రలో వరద మొదలైనప్పటి నుంచే ఎత్తిపోసుకునేలా కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- సమస్యల పరిష్కాంపై తీర్మానాల ఊసే లేని ఐఏబీ
- కాలువల మరమ్మతులను పట్టించుకోలేదు
- చర్చ లేని జీఆర్‌పీ ఎత్తిపోతల పథకాలు
- పత్తికొండ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు పూర్తి చేసేదెన్నడు?
- ఎమ్మెల్యేలను తప్పుదోవ పట్టిస్తున్న ఇంజనీర్లు
- సాగు నీటి అంశం ఒక్కటే అజెండా
- తీర్మానాలు లేకుండానే ముగిసిన తొలి ఐఏబీ సమావేశం ఇదే

### హంద్రీనీవా పంట కాల్వలపైనా అదే పరిస్థితి

శ్రీశైలం జలాశయం ఎగువన 40 టీఎంసీలు ఎత్తిపోసి 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్న ప్రధాన లక్ష్యం. కర్నూలు జిల్లాలో 8 టీఎంసీలు వాటాను వినియోగించుకొని 73,332 ఎకరాలకు నీరు ఇవ్వాలి. పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువల ద్వారా 60 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంటే.. 20 వేల ఎకరాలకు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. కారణం.. ఆయా కాల్వల పరిధిలో సింగిల్ లైన్ బ్రిడ్జి (ఎస్‌ఎల్‌బీ), ఆర్‌బీసీ, ఫీల్డ్ చానల్స్, డిస్ట్రిబ్యూటరీలు వంటి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.180 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపితే పక్కన పడేసింది. 2024-25 ఎస్ఎస్‌ఆర్ రేట్లు ప్రకారం రూ.200 కోట్లకు చేరుతుందని అంచనా. పశ్చిమ పల్లెసీమల్లో కరువు నివారించే కీలకమైన అసంపూర్తి పనులపై చర్చలేకుండానే సమావేశాన్ని ముగించారు. వీటితో పాటు పత్తికొండ, డోన్ నియోజకవర్గంలో హంద్రీనీవా నుంచి 68 చెరువులు నింపే ప్రాజెక్టుపై.. పత్తికొండ నియోజకవర్గంలో 38 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోసే పనులపై నామమాత్రంగానే చర్చించారనే రైతులు అంటున్నారు.

### నీళ్లు సరే.. మరమ్మతులు ఏవీ..?

తుంగభద్ర జలాశయం నుంచి ఎల్లెల్సీకి 24 టీఎంసీల నికర జలాలు వాటా ఉంది. 16-18 టీఎంసీలకు మించి రావడం లేదు. ఖరీఫ్‌లో 43,519 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంటే.. 35 వేల ఎకరాలకు మాత్రమే ఇస్తామని ఇంజనీర్లు ప్రణాళిక సిద్ధం చేశారు. కోసిగి, మంత్రాలయం, పెద్దకడుబూరు, నందవరం, గోనెగండ్ల, కోడుమూరు, గూడూరు, సి. బెళగల్ మండలాల్లో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు ద్వారా ఖరీఫ్ ప్రారంభం నుంచే తుంగభద్ర జలాలు ఎత్తిపోసి సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా.. సప్లిమెంట్ పేరిట పంపులు రన్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పైపుల లీకేజీల వల్లే ఈ దుస్థితి ఉంది. అలాగే.. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులు లేక మేజరు కాల్వల కింద డిస్ట్రిబ్యూటరీ కాలువలు, తూములు దెబ్బతిన్నాయి. మరమ్మతులపై సమగ్ర చర్య లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో తక్షణ మరమ్మతుల కోసం 146 పనులకు రూ.12.77 కోట్లు నిధులు ఇవ్వాలని నివేదిక పంపారు. అజెండాలో ఆ అంశం ఉంచారే తప్ప చర్చకు నోచుకోలేదని అంటున్నారు.

జిల్లాల పునర్విభజన తరువాత కర్నూలు జిల్లాకు మిగిలిన ఏకైక మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు గాజుల దిన్నె. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), హంద్రీనీవా కాలువ సహా గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వివిధ సాగునీటి వనరుల ద్వారా సాగునీరు అందే ఆయకట్టు 3.14 లక్షల ఎకరాలు ఉంది. గతేడాది ఖరీఫ్, రబీలో అధికారిక రికార్డుల ప్రకారం 1.01 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందింది. జిల్లాలో ఖరీఫ్, రబీ సాధారణ సాగు విస్తీర్ణం 6.45 లక్షల హెకార్టులు (16.12 లక్షల ఎకరాలు) ఉంటుందని వ్యవసాయ అధికారుల అంచనా. ఈ లెక్కల ప్రకారం జిల్లాలో సాగునీరు అందే ఆయకట్టు కేవలం 19.47 శాతమే. అందులో ఏటా సాగునీరు అందేది 6.25 - 12 శాతానికి మించదని ఇంజనీర్లు అంటున్నారు. అంటే.. 85-90 శాతం వర్షాధారంగా పత్తి, వేరుశనగ, టమోటా, ఉల్లి, మొక్కజొన్న, ఆముదం, కంది.. వంటి పంటలు సాగు చేస్తున్నారు. వానొస్తే పంట దిగుబడులు ఇంటికి చేరుతాయి.. కరువొస్తే అప్పుల కన్నీటి' కష్టాలు రైతులకు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు ద్వారా ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకొని కష్టజీవులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఉన్న నీటివనరులు కూడా నిరుపయోగంగా మారాయి. కొత్తగా ఏర్పడిన సీఎం చంద్రబాబు ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులపై దృష్టి సారించింది. శాశ్వత మరమ్మతుల దిశగా అడుగులు వేస్తుంది. కొత్తగా ఎంపికైన ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా సాగునీటిపై చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నారు. ఇలాంటి సమయంలో ఐఏబీ సమావేశం వేదికగా కరువు రైతుల కన్నీళ్లు తుడిచే ప్రాజెక్టులపై తాజా పరిస్థితిపై వివరంగా చర్చలు జరపాలి.. ఆ దిశగా ఇంజనీరింగ్ అధికారులు చొరవ తీసుకోవాలి. ఇందుకు విరుద్ధంగా ఐఏబీ సమావేశం ముగించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బసలదొడ్డి రిజర్వాయర్



### ఒక్క తీర్మానం లేకుండానే ముగిసిన ఐఏబీ

కలెక్టరు పి. రంజిత్‌బాషా చైర్మన్‌గా ఆయన అధ్యక్షతన జరిగిన తొలి ఐఏబీ సమావేశం ఇది. ఏ ప్రాజెక్టు కింద ఎన్ని ఎకరాకల ఆయకట్టుకు సాగునీరు ఇస్తామో ప్రధానంగా చర్చించాలి. నిర్ణయించిన ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు ఉన్న ఇబ్బందులను, మరమ్మతులను చర్చించాలి. కొత్త ఆయకట్టు, ప్రాజెక్టులపై కూడా చర్చించడంతోపాటు ప్రజాప్రతినిధులు సలహాలు తీసుకొని తీర్మానాలు చేయాలి. ఈ తీర్మానాల మేరకు ఐఏబీ చైర్మన్ అయిన కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలి. ఆ బాధ్యతను ఐఏబీ కన్వీనర్ అయిన ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి తీసుకోవాలి. గత పదేళ్ల ఐఏబీ సమావేశాలను పరిశీలిస్తే.. ఒక్క తీర్మానం కూడా చేయకుండా ముగించిన సమావేశం ఇదే.

## జిల్లా అంతటా జడివాన

### మరో రెండు రోజులు ఇదే పరిస్థితి

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 20: కర్నూలు జిల్లాలో రెండు రోజుల నుంచి జడివాన కురుస్తూనే ఉంది. శనివారం కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల్లో సాధారణం నుంచి మోస్తరుగా వర్షాలు కురిశాయి. వెల్దుర్తిలో 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా క్రిష్ణగిరిలో 48.4 మి.మీ., కోడుమూరులో 38.6 మి.మీ., గూడూరులో 36.2, సి.బెళగల్ మండలంలో 35.2, ఎమ్మిగనూరులో 30.8, మంత్రాలయంలో 28.2, గోనెగండ్లలో 27.6, నందవరంలో 23.4, కర్నూలు రూరల్‌లో 21, ఓర్వకల్లులో 20, కర్నూలు అర్బన్‌లో 19.4, కోసిగిలో 19.2, కల్లూరులో 18.2, పెద్దకడుబూరులో 10.4మి.మీ., వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

## జేసీ, కర్నూలు కమిషనర్ బదిలీ



నారపురెడ్డి మౌర్య



ఎ.భార్గవ్‌తేజ

కర్నూలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్‌తేజలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న నారపురెడ్డి మౌర్యను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆమె గత వైసీపీ ప్రభుత్వంలో కర్నూలు జేసీగా ఇక్కడకు వచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్‌గా పని చేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా గత ప్రభుత్వంలో బదిలీపై వచ్చిన భార్గవ్‌తేజను ప్రభుత్వం గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసింది. అయితే కర్నూలు జేసీ, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించలేదు. త్వరలోనే ఆ స్థానాలు భర్తీ చేసే అవకాశం ఉంది.

## నూతన క్యాజువాలిటీని ప్రారంభించండి

### కర్నూలు జీజీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



జీజీహెచ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), జూలై 20: 'అత్యవసర వైద్యం కోసం చాలా మంది రోగులు ఇక్కడ ఉన్నారు. ప్రత్యామ్నాయం లేదా..? తక్షణమే 20 పడకల నూతన క్యాజువాల్టీని ప్రారంభించండి..' అని కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన కర్నూలు జీజీహెచ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఓపీ విభాగాన్ని పరిశీలిస్తూ రోజుకు ఎన్ని ఓపీలు ఇస్తున్నారు. ఎన్ని కౌంటర్లు నిర్వహిస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డిని ప్రశ్నించారు. మొత్తం 10 కౌంటర్లు ఉన్నాయని, విభిన్న ప్రతిభావంతులకు చిన్న పిల్లలు, తల్లులకు ఓపీలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వార్డులు ఎక్కడ ఉన్నాయో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. అలాగే ఏ బ్లాకులో ఏ వార్డులు, ఏ అంతస్థులో ఉన్నాయనే వివరాలను మ్యాప్ రూపంలో రూపొందించాలన్నారు. ఏఎంసీలో ఉన్న క్రిటికల్ కేర్ రోగులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు వెళ్లారు. సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్‌కు ఎన్ని గదులు ఉన్నాయనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మరో సీటీ స్కాన్ గ్రీన్ కో ఎనర్జీ కంపెనీ అందజేస్తున్నారని సూపరింటెండెంట్ కలెక్టర్‌కు వివరించారు. విజయవాడ, వైజాగ్ తరహాలో ఎస్టీఆర్ ఆసుపత్రి, మానసిక హాస్పిటల్ ఇలా విడిగా ఏర్పాటు చేస్తే రోగులకు సౌకర్యవంతంగా ఉంటుందని, దీన్ని పరిశీలించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి, డీఎంహెచ్‌వో డా.ప్రవీణ్‌కుమార్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి హెచ్చరిక

**కర్నూలు(అర్బన్), జూలై 20:** 'అధిష్ఠానం అన్నీ గమనిస్తుంది.. పార్టీ ఆదేశాలు ధిక్కరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆలూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుతమ్ముళ్లతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజులుగా సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్‌కు వ్యతిరేకంగా, అనుకులంగా జిల్లా పార్టీ కార్యాలయానికి భారీగా టీడీపీ శ్రేణులు తరలివచ్చి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఈ తరుణంలో టీడీపీ శ్రేణులతో తిక్కారెడ్డి చర్చించి ఇరువురి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఆదేశించారు. ఎవరికి కేటాయించిన పనులు వారు చేసుకుంటూ పోవాలన్నారు. పార్టీలో అసమ్మతి సహజంగానే ఉంటుందని, అందరు కలిసి కూర్చొని చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకుంటూ పోతే పార్టీ మరింత బలపడుతుందని నాయకులకు వివరించే ప్రయత్నం చేశారు. అంతర్గత కుమ్ములాటలు ఉంటే ప్రత్యర్థులు బలపడే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అందరం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు.

## గుంతకల్లు వెస్ట్ - మల్లప్పగేట్ డబుల్ రైల్వేలైన్ పనుల్లో పురోగతి

● భూసేకరణకు నోటీస్ జారీ చేసిన రైల్వే శాఖ
● చిప్పగిరి మండలంలో 29 ఎకరాల సేకరణ

**కర్నూలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి):** ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్, రైల్ ఓవర్ రైల్ (ఆర్ఓఆర్) డబుల్ లైన్ నిర్మాణంలో భాగంగా గుంతకల్లు వెస్ట్ - మల్లప్ప గేట్ మధ్య డబుల్ రైల్వేలైన్ నిర్మాణం కోసం సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేశారు. మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామం పరిధిలో 21.31 ఎకరాల ప్రైవేటు భూమి, 2.25 ఎకరాల అసైన్డ్ ల్యాండ్, 2.91 ఎకరాల ప్రభుత్వ భూమి, దౌలతాపురం గ్రామంలో 8.08 ఎకరాల ప్రైవేటు భూమి, నంచర్ల గ్రామంలో 0.10 ఎకరాల ప్రైవేటు భూమి కలిపి 29.49 ఎకరాలు. ప్రైవేటు భూమి 2.55 ఎకరాలు, అసైన్డ్ ల్యాండ్ 2.91 ఎకరాలు ప్రభుత్వ భూమిని సేకరించనున్నారు. ఏ రైతు ఎంత భూమి కోల్పోతున్నారో సర్వే నంబర్ల వారీగా భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేశారు. అభ్యంతరాలు ఉన్న రైతులు రాతపూర్వకంగా 30 రోజుల్లోగా భూ సేకరణ అధికారి పత్తికొండ ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**కర్నూలు(కలెక్టరేట్), జూలై 20:** కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పాములపాడులో వ్యక్తి దారుణ హత్య

**పాములపాడు, జూలై 20:** పాములపాడులో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మినారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇస్కాల గ్రామానికి చెందిన చిన్న లింగ స్వామి అలియాస్ ఎర్రన్న (46)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. లింగస్వామి గత సంవత్సరం క్రితం పాములపాడు గ్రామంలో ఓ అద్దె భవనంలో నివాసం ఉంటూ పాట్లేళ్ళ వ్యాపారం చేస్తుండేవాడని సీఐ తెలిపారు. శుక్రవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో లింగ స్వామికి ఫోన్ కాల్ రాగానే ఆయన వెంటనే బయటికి వెళ్లాడు. లింగ స్వామి రాత్రి పది దాటినా ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి బంధువులతో కలిసి వెతికారు. చెలిమిల్ల రస్తా దారిలో ఎస్సార్బీసీ కాలువ సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటనపై లింగస్వామి భార్య చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించాలి

న్యాయాధికారి లీలా వెంకట శేషాద్రి



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

**కర్నూలు(లీగల్), జూలై 20:** బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించి మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి కోరారు. ఈ మేరకు స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో బాలల న్యాయ చట్టంపై శనివారం ఒక న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల విషయంలో అంతర్జాతీయ ఒడంబడిక మేరకు రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక నిబంధనలపై పోలీసులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలల్లో నేరస్వభావాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి కౌన్సిలింగ్, విద్యాబోధన ద్వారా మార్పు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారి పి. జ్యోత్స్నాదేవి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

ఆర్‌యూ ఉపకులపతి ఎన్‌టీకే నాయక్


ఆర్‌యూలో హాస్టళ్లను పరిశీలిస్తున్న ఉపకులపతి

**కర్నూలు(అర్బన్), జూలై 20:** హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శనివారం హాస్టళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్సిటీ హాస్టళ్లలో పరిసరాలను శుభ్రం చేసే పనుల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వర్సిటీ లైఫ్ సైన్సు విభాగాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరును పరిశీలించారు. తరగతులు జరుగుతున్న విధానాన్ని గమనించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా సమయపాలన పాటించి పాఠ్యాంశాలు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. నాల్గవ సెమిస్టర్ పరీక్షలు సోమవారంతో పూర్తవుతాయని, త్వరలో ప్రారంభం కానున్న రెండో సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులంతా శ్రద్ధ చదువుకోవాలని సూచించారు.

## ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు

**సి.బెళగల్, జూలై 20:** మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో మొహర్రం పండుగ రోజున వైసీపీ నాయకులు, టీడీపీ నాయకులు ఘర్షణ పడ్డారు. రెండు వర్గాల ఫిర్యాదు మేరకు టీడీపీ, వైసీపీ ఇరువర్గాలైన టీడీపీకి చెందిన రాజు వర్గానికి చెందిన ఆరుగురిపై, వైసీపీకి చెందిన నరసింహ నాయుడు వర్గానికి చెందిన 9 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నది తీర గ్రామాలైన తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట గ్రామాలలో పర్యటించి నదితీరా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ నదితీర పొలాలు ఉన్న రైతులు విద్యుత్ మోటార్లను ఎగువ ప్రాంతానికి తరలించాలన్నారు.

# ముచ్చుమర్రి ఉదంతంలో అనూహ్య ఘటన

● విచారణలోని వ్యక్తి అనుమానాస్పద మృతి
● నంద్యాల జీజీహెచ్‌కు మృతదేహం తరలింపు
● గోప్యంగా వ్యవహరించిన పోలీసులు
● మీడియాను, రోగులను ఆసుపత్రిలోకి అనుమతించని వైనం


మృతి చెందిన హుసేని

**నంద్యాల నూనెపల్లె/ నందికొట్కూరు, జూలై 20:** నందికొట్కూరు నియోజకవర్గం ముచ్చుమర్రి బాలిక ఉదంతంలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. కేసు విచారణలో భాగంగా పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఓ వ్యక్తి శనివారం తెల్ల వారుజామున అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. బాలిక వాసంతిని అత్యాచారం చేసి, హతమార్చిన వారిలో ఓ బాలుడి మేనమామలు హుసేని(34), ఏసును నంద్యాల సీసీఎస్ పోలీసులు విచారణ నిమిత్తం రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే పోలీసులు విచారణలో ఉన్న హుసేని అస్వస్థతకు గురయ్యాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని నంద్యాలలోని జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. శనివారం ఉదయం 8:45 నిమిషాలకు హుసేనిని పోలీసులు ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. హుసేని మృతదేహాన్ని క్యాజువాలిటిలోనే ఉంచగా మీడియాను, చికిత్సకోసం వచ్చిన రోగులను లోపలికి అనుమతించలేదు. ఇదిలా ఉండగా మృతుడి శరీరంపై పోలీసుల లాఠీ గాయాలు ఉండటం పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఆసుపత్రి ఆవరణంలో దాదాపు 20 మంది సీఐలు మరికొంత మంది ఎస్ఐలు, సీసీఎస్, ఎస్బీ, ఇంటెలిజెన్స్ పోలీస్ సిబ్బంది అధిక సంఖ్యలో చేరుకున్నారు. జరిగిన ఘటనపై నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, అక్కడున్న సీఐలను పాత్రికేయులు వివరణ కోరగా తమకేమి తెలియదని చెప్పారు. హుసేని మృతదేహాన్ని గుట్టు చప్పుడుకాకుండా మీడియా కన్నుగప్పి ఆసుపత్రి వెనుక బాగం నుంచి మార్చురి గదికి పోలీసులు తరలించారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు మృతుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రి వైపు రాకపోవడం కూడా పోలీసుల తీరుపై పలు అనుమానాలను రేకిత్తిస్తున్నాయి. నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ఆసుపత్రి మార్చురీ గదిలో హుసేని మృతదేహాన్ని పరిశీలించాలని డిమాండ్ చేశారు. వాసంతి ఘటనను సీబీసీఐడీతో విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా గత నాలుగేళ్లుగా హుసేని తన అక్కతో కలసి నందికొట్కూరులోని ఆత్మకురు రోడ్డులో ఉన్న బైరెడ్డి నగర్‌లో జీవనం సాగిస్తున్నాడు. హుసేనికి రెండు వివాహాలు జరగ్గా వారిద్దరితోనూ విడాకులు తీసుకున్నాడు.


మృతుడి శరీరంపై గాయాలు

**వెనువెంటనే అంత్యక్రియలు :** హుసేని అంత్యక్రియలు కూడా వెనువెంటనే జరిగిపోయాయి. ఆయన మృతదేహానికి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి తరలించారు. హుసేని కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో శనివారం రాత్రి అంత్యక్రియలు పూర్తయ్యాయి.


డీటీహెచ్ క్యాజువాలిటీ వద్ద రోగులను లోపలికి అనుతించని దృశ్యం

### ఎస్పీ ఏమన్నారంటే...



**నంద్యాల క్రైం, జూలై 20:** నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో బాలిక అదృశ్యం కేసులో నిందితుడు హుసేని మృతిపై ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శనివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసులో అనుమానితుడిగా ఉన్న హుసేనిని నంద్యాల పట్టణ శివారు మసీదుపురం మెట్ట వద్ద అదుపులోకి తీసుకున్నా మన్నారు. విచారణలో భాగంగా నందికొట్కూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మిడ్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో తలముడిపి బాట వద్ద నిందితుడు పోలీస్ జీపులో నుంచి దూకి పారిపోయేందుకు యత్నించాడన్నారు. నిందితుడిని వెంబడించి పట్టుకోగా ఆయాసంతో గుండె నొప్పి ఉందని హుసేని చెప్పాడన్నారు. వెంటనే అతడిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు నిర్ధారించారని ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి మిడుతూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన డీఎస్పీ స్థాయి అధికారిని దర్యాప్తు అధికారిగా ఉన్నతాధికారులు నియమించారని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ శవ పంచనామా నిర్వహించారని ఎస్పీ తెలిపారు. మృతుడు హుసేన్ గత కొంత కాలంనుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు శవ పంచనామా సమయంలో మెజిస్ట్రేట్ ముందు మృతుడి బంధువులు చెప్పారని ఎస్పీ పేర్కొన్నారు. కేసు నిష్పక్షపాత దర్యాప్తులో భాగంగా డాక్టర్ల బృందంతో పోస్టుమార్టం చేయించామని, మొత్తం పోస్టుమార్టం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయించినట్లు వెల్లడించారు. చట్ట ప్రకారం అన్ని నియమ, నిబంధనలు పాటించి ఈ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు.

## పందికోన రిజర్వాయర్ చేపల వేలం వాయిదా

● తమ గ్రామానికి సమాచారం లేదని అడ్డుకున్న కొత్తపల్లి గ్రామస్థులు
● 25 మంది చెల్లించిన ధరావత్తు తిరిగి చెల్లింపు



మాట్లాడుతున్న మత్స్యశాఖ జిల్లాఅధికారి శ్యామల

**పత్తికొండ, జూలై20:** పందికోన రిజర్వాయర్ చేపల వేలం ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఈనెల 31కి వాయిదా పడింది. పందికోన రిజర్వాయర్‌లో ఏడాదిపాటు చేపల పెంపకం, అమ్మకాలకు సంబంధించి శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశభవనంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించారు. 12గంటల వరకు వేలాల్లో పాల్గొనే వారు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ప్రకటించారు. మొత్తం 25 మంది రూ10 వేల ధరావత్తు చెల్లించి వేలంపాటకు సిద్ధం అయ్యారు. అయితే తమ గ్రామానికి ఎలాంటి సమాచారం అందించకుండా నిర్వహిస్తున్నందు వల్ల చేపల వేలాలు నిలిపివేయాలంటూ కొత్తపల్లికి చెందిన నాయకులు మత్స్యశాఖ అధికారితో వాగ్వివాదానికి దిగారు. 10 రోజుల ముందే అందరికీ వేలాల గురించి సమాచారం ఇచ్చామని, వార్తాపత్రికల్లో సైతం వార్తలు వచ్చాయని, తీరా వేలాలు జరుగుతున్న సమయంలో ఇలా అడ్డుకోవడం సరికాదని వారికి మత్స్యశాఖ అధికారి సమాధానం ఇచ్చారు. అయినప్పటికీ వారు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు వారిని బయటికి పంపించి 12 గంటలకు వేలాలు ప్రారంభిస్తామని పాటదారులకు ఆమె తెలియచేశారు. రిజర్వాయర్ సమీపంలో ఉన్న గ్రామాలైన పందికోన-కొత్తపల్లి గ్రామాల నడుమ సయోధ్య కోసం వేలాలను వాయిదావేసి కొంత సమయం అందించాలని టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి జిల్లా మత్స్యశాఖ అధికారిని కోరారు. దీంతో పై అధికారులతో మాట్లాడిన అనంతరం మత్స్యశాఖ అధికారి శ్యామల వేలాలు ఈనెల 31కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 31వ తేదిలోగా సమస్యను పరిష్కరించుకుని రెండు గ్రామాల ప్రజలు వేలాలకు, చేపల పెంపకానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డీఈ చంద్రయ్య, తహసీల్దార్, ఎంపీడీవో రామారావు, సీఐ మురళీమోహన్ ఉన్నారు.


మూసివేసిన గేటుభయట గ్రామాల ప్రజలు

**ఎంపీడీవో కార్యాలయం గేట్లు మూసివేత..**

చేపల వేలాలను అడ్డుకునేందుకు కొత్తపల్లి గ్రామస్థులు సిద్ధం కావడంతో సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వేలాలు నిర్వహిస్తున్న సమావేశ భవనంలోకి వేలం పాటదారులు, మీడియా ప్రతినిధులను మాత్రమే అనుమతించారు. కార్యాలయం ఆవరణలో ఉన్న ప్రజలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు వారిని బయటికి పంపి గేట్లు మూసివేశారు.

## నిప్పంటించుకొని మహిళ ఆత్మహత్య

**కోసిగి, జూలై 20:** మండల పరిధిలోని తుమ్మిగనూరు గ్రామంలో కొండ హనుమంతమ్మ (28) అనే మహిళ శనివారం నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండల పరిధిలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన కొండ రామాంజనేయులుతో హనుమంతమ్మకు ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. గత నెల జూన్ 26న తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలో ఏడాది వయస్సున్న తన కుమారుడు విశ్వనాథ్‌ను హనుమంతమ్మ గొంతు నులిమి చంపేసింది. ఆమె కూడా గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు ప్రయత్నించడంతో పక్కనే ఉన్న స్థానికులు, కుటుంబ సభ్యులు కలిసి అడ్డుకున్నారు. కుమారుడిని హత్య చేసినప్పటి నుంచి భార్యను భర్త చేరదీయలేదు. అప్పటి నుంచి భార్య పుట్టినిల్లయిన తుమ్మిగనూరు గ్రామంలోనే ఉంటోంది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో హనుమంతమ్మ చీరకు నిప్పంటించుకుని ఆత్మహత్యకు చేసుకుంది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేకపోవడం వల్లే ఇలా చేసినట్టు తెలుస్తోంది. ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


హనుమంతమ్మ (ఫైల్)

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఉమ్మడి కర్నూలు జిల్లా ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం.ఉమాపతి


కరపత్రాన్ని విడుదల చేస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ

**కల్లూరు, జూలై 20:** వర్షాకాలంలో వినియోగదారులు, రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని విద్యుత్ భవన్‌లో ఆయన సమావేశం నిర్వహించి అధికారులు, వినియోగదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పవర్ కట్ ఉన్న ప్రాంతాల్లో వినియోగదారులు, రైతులు ట్రాన్స్‌ఫార్మర్, ఏబీ స్విచ్‌ల వద్ద సొంతంగా రిపేరి చేయకూడదన్నారు. వెంటనే విద్యుత్‌శాఖ ఏఈ, లైన్‌మెన్‌కు గాని 1912 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని అన్నారు. మోటార్లు, స్టార్టర్ల వద్ద రబ్బరు మ్యాట్ ఉపయోగిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఎస్ఈ సూచించారు. విద్యుత్‌శాఖ అధికారులు తమకు కేటాయించిన మండల హెడ్‌క్వార్టర్స్‌లో నివాసం ఉండాలన్నారు. కండెక్టర్లపై ప్లాస్టిక్ పైపులు వేయరాదని, వినియోదారులు గృహాల్లో ఉపయోగించే విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు ఐఎస్ఐ గుర్తింపు పొందిన పరికరాలను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ, కర్నూలు డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈ పి. ఓబులేసు, టెక్నికల్ ఏడీఈ విజయ భాస్కర్, విజిలెన్స్ సీఐ పార్థసారధిరెడ్డి, ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## జగన్...శవ రాజకీయాలు మానుకో

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



**కర్నూలు(అర్బన్), జూలై 20:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో ఎంతో మంది ప్రాణాలను హరించి, రాష్ట్ర ప్రజలకు రక్షణ లేకుండా చేసిన వైఎస్ జగన్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేయడాన్ని తప్పుపట్టారు. వినుకొండలో వ్యక్తిగత కక్షలతో రషీద్ అనే వ్యక్తి మరణిస్తే దానిని తన రాజకీయ స్వార్థం కోసం ఉపయోగించుకునేందుకు జగన్మోహన్‌రెడ్డి శవ రాజకీయాలను చేస్తున్నారని విమర్శించారు. సీబీఐ కేసుల్లో కోర్టుకు హాజరుకాకుండా కుంటి సాకులు చూపిస్తున్న జగన్‌ను తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

## కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు పీఠాధిపతి సన్మానం


కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో మాట్లాడుతున్న పీఠాధిపతి

**మంత్రాలయం, జూలై 20:** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఘనంగా సన్మానించారు. శనివారం బెంగుళూరులోని నిరంజన జగద్గురు సిద్ధరామేశ్వర స్వామీజీ దీక్షా మహోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ముఖ్య అతిథి సీఎం సిద్ధరామయ్యను మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సన్మానించారు. ఈ సందర్భంగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ద్వార పాలక అనంతస్వామి, ప్రకాషాచార్, భీమ్‌సేన్‌రావు, పవనాచార్ పాల్గొన్నారు.

## కేసీ కాలువకు గండి


చాగలమర్రి సమీపంలో కేసీ కాలువకు పడిన గండి

**చాగలమర్రి, జూలై 20:** చాగలమర్రి గ్రామ సమీపంలోని 11 కమాండ్ల వద్ద కేసీ కాలువ కోతకు గురై శనివారం గండి పడింది. ఎడతెరిపి లేకుండా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కేసీ కాలువ మట్టి కట్ట కోతకు గురైంది. కమాండ్ల వద్దగల సైడ్‌వాల్ కుంగిపోయింది. రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కాలువకు లీకేజీ నీరు కాలువ వెంట ప్రవహిస్తోంది. ఈ నీరు గండిపడ్డ చోట కాలువలోకి వెళ్తోంది. భారీ వర్షాలు కురిస్తే భారీ గండిపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి సైడ్‌వాల్, కేసీ కాలువ మరమ్మతు పనులు తక్షణమే చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## తరగతి గదులను, టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచుకోవాలి


గూడూరులోని వసతి గృహాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

**గూడూరు జూలై 20:** ప్రభుత్వ పాఠశాలు, వసతి గృహాల్లో గదులను, టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచాలని ఆర్డీవో శేషిరెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ప్రభుత్వ పాఠశాలు, హస్టల్స్ తనిఖీలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలకు నాణ్యమైన భోజనం అందిచాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను పరిశీలించి ప్రజలకు శుభ్రమైన నీటని అందించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ దివాకర్ రెడ్డి, ఎంఈవో సునీలమ్మ, ఏఈ నరసింహులు, అధికారులు ఉన్నారు.

## అంకితభావంతో విధులు నిర్వహించండి


నియామకపత్రాలు అందుకున్న ఉద్యోగులతో చైర్మన్ వై.పాపిరెడ్డి, అధికారులు

**కర్నూలు(న్యూసిటీ), జూలై 20:** ప్రభుత్వ ఉద్యోగులుగా అంకితభావంతో విధులు నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నూతనంగా ఉద్యోగం పొందిన వారికి సూచించారు. జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్యనియామకాల కింద ఉద్యోగ అర్హత సాధించిన ఐదు మందికి శనివారం కార్యాలయంలో చైర్మన్, సీఈఓ జి.నాసరరెడ్డి నియామకపత్రాలు అందజేశారు. జిల్లా పరిషత్ పరిధిలోని కార్యాలయాలో పని చేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన వారి స్థానంలో 5 మందిని నాల్గవ తరగతి ఉద్యోగులుగా నియమించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, చైర్మన్ సీసీ అశ్వినికుమార్, సీఈఓ సీసీ భరత్ కుమార్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ హక్ ఉన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌసదేశాయ్

**కర్నూలు(న్యూసిటీ), జూలై 20:** ప్రభుత్వ స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు తొలగించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే.వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తారని గంపెడు ఆశతో ఎదురుచూస్తున్నారని అన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, నాయకులు నాగేశ్వరరావు, బాలదుర్గమ్మ, కృష్ణవేణి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

## బార్ కౌన్సిల్‌పై న్యాయవాదుల ఆగ్రహం

**కర్నూలు(లీగల్), జూలై 20:** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఏపీ బార్ కౌన్సిల్‌లు ఇటీవలే జారీ చేసిన సర్క్యులర్‌లపై కర్నూలు న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు సమావేశమయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ అంశంపై ఇటీవల రెండు సర్కులర్‌లను జారీ చేశారని, ఈ సర్క్యులర్లు న్యాయవాద వృత్తికి విఘాతం కలిగించేలా ఉన్నాయని, వాటిని వెంటనే నిలుపుదల చేయాలన్నారు. 22, 23 తేదీల్లో ఈ సర్క్యులర్లకు వ్యతిరేకంగా న్యాయవాదులు తమ విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేర, న్యాయవాదులు పాల్గొన్నారు.


## ఆచార్య ఎస్వీ కృష్ణమూర్తి శతజయంతి వేడుకలు

**కర్నూలు(అర్బన్), జూలై 20:** బహుభాషా, బహుముఖ ప్రజ్ఞా శాలి ఆచార్య ఎన్వీ కృష్ణమూర్తి విద్యార్థులకు మార్గనిర్దేశకులని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జీవీ రమణయ్య అన్నారు. ఉస్మానియా కళాశాలలో ఆచార్యఎన్వీ కృష్ణమూర్తి శతజయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా స్థాయి డిగ్రీ కళాశాల్లో విద్యార్థులకు నిర్వహించిన సాహిత్య కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలైన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కవితా పఠనం, పాటల పోటీలు, వ్యాసరచనలు, తదితర పోటీపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యాద్ జమీవుద్దీన్, తెలుగు శాఖ అధ్యక్షులు మండి అన్వర్ హుసేన్, కల్కూర చంద్రశేఖర్, జేఎస్ఆర్ కేశర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇన్‌స్పైర్ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

**కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 20:** 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని పాఠశాలల విద్యార్థుల నుంచి ఇన్‌స్పైర్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. శనివారం డీఈవో కార్యాలయంలో ఇన్‌స్పైర్ అవార్డుల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, శాస్త్ర సాంకేతిక మండలి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి ప్రాజెక్టు విద్యార్థుల ఎంపికకు జిల్లా స్థాయి ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈ అవార్డుకు 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులని అన్నారు. ప్రతి అప్పర్ ప్రైమరీ పాఠశాల 3, ఉన్నత పాఠశాలలో 5 ఇన్‌స్పైర్ నామినేషన్లు చేయాలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ రంగమ్మ సెల్.నెం.8790111331ను సంప్రదించాలన్నారు.

## 'జిల్లా రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలి'


మాట్లాడుతున్న వీవీ నాయుడు

**కర్నూలు(కలెక్టరేట్), జూలై 20:** కల్లూరు సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్టర్ నాగలింగేశ్వరరావులను సస్పెండ్ చేయాలని రాయలసీమ యువజన పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షులు వీవీ నాయుడు, వినోద్ కుమార్ మాట్లాడుతూ నిషేధిత సర్వే నంబర్లలో ఉన్న భూములకు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ఆయన ప్రశ్నించారు. నిబంధనలను అతిక్రమించి వ్యవహరిస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అక్రమ రిజిస్ట్రేషన్లపై దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, భాస్కర్, రాజశేఖర్, వసంత్, లక్ష్మణ్, సురేష్ పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

● ఎంపీడీవో మల్లేశ్వరిని అభినందించిన ఎమ్మెల్యే గౌరు చరిత


ఓర్వకల్లులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత, జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

**ఓర్వకల్లు, జూలై 20:** మానవ మనుగడకు మొక్కల పెంపకం చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం ఓర్వకల్లులోని ఉపాధి కార్యాలయం ఎదురుగా ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి నాయకులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం పెరగకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. ఓర్వకల్లు ఎంపీడీవో మల్లేశ్వరి ఓ ప్రణాళికతో 9వేల మొక్కలు గ్రామాల్లో నాటించి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురవాలంటే మొక్కలు పెంచడం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, ఏపీడీ లక్ష్మన్న, నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామచంద్రుడు, శ్రీనివాసులు, కేవీ మధు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

### వైద్యులు పని వేళలు పాటించాలి

వైద్యులు పని వేళలు పాటించి విధులు నిర్వహిస్తూ రోగులకు సేవలు అందిచాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం ఆమె టీడీపీ నంద్యాల అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఓర్వకల్లులోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు వార్డులకు వెళ్లి అక్కడ అందుతున్న వైద్యసేవలపై రోగులను ఆరా తీశారు. వైద్యులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. మధ్యాహ్నం 1 గంటైనా వైద్యులు ఎందుకు రాలేదని మెడికల్ ఆఫీసర్ మంజులను ప్రశ్నించగా.. దానికి ఆమె వస్తున్నారని సమాధానం చెప్పడంతో.. వైద్యులు పని వేళలు ఎందుకు పాటించడం లేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. స్టాఫ్ నర్సులు ఎంత మంది ఉన్నారని ఎమ్మెల్యే ఆరా తీశారు. వైద్యసిబ్బంది కొరత ఉందని ఎమ్మెల్యేకు మెడికల్ ఆఫీసర్ వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందు వల్ల వైద్యులు సక్రమంగా హాజరై రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. మధ్యాహ్నం 1 గంటైనా 200 మంది రోగులు ఉండటంతో వైద్యసిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంపై కర్నూలు డీఎంహెచ్‌వోతో మాట్లాడి వైద్య సిబ్బంది కొరతను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, భాస్కర్ రెడ్డి, నాయకులు నాగేశ్వరరెడ్డి మహబూబ్ బాషా, విజయుడు, ఖాజామియా తదితరులు ఉన్నారు.

# అలరించిన 'భువన విజయం' సాహిత్య రూపకం


'భువన విజయం' సాహిత్య రూపకం ప్రదర్శిస్తున్న సాహితీవేత్తలు

**కర్నూలు(కల్చరల్), జూలై 20:** ఆచార్య ఎన్వీ కృష్ణమూర్తి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'భువన విజయం' సాహిత్య రూపకం అసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. ప్రముఖ శతావధాని బ్రహ్మశ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మ బృందం ఆధ్వర్యంలో, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని క్లస్టర్ వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత ఆచార్య ఎన్వీ కృష్ణమూర్తి చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ, సాహితీ సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర అధ్యక్షత వహించగా, వక్తలుగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ ఎన్ వేణుగోపాల్, సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ వక్తలుగా ప్రసంగించారు. ఆచార్య డీవీఆర్ సాయి గోపాల్ మాట్లాడుతూ జిల్లాలోని సాహితీవేత్తలను, సాహిత్యాభిలాషులను ఒక చోట చేరి ఏటా విస్తృత స్థాయిలో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న సాహితీ సదస్సు సంస్థ సేవలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని చెప్పారు. సుప్రసిద్ధులైన నటులు, సాహితీవేత్తలు కలిసి భువన విజయం రూపకం ప్రదర్శించడం అభినందనీయమని, తెలుగు భాషకు జీవంపోసే ఇలాంటి కార్యక్రమాలను మున్ముందుకూడా నిర్వహించాలని ఆయన సూచించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఎన్ని వందల పర్యాయాలు ప్రదర్శించినా, చూసినా భువన విజయం సాహిత్య రూపకం కొత్తగానే ఉంటుందన్నారు. సందర్భంగా భువన విజయం కళాకారులను ఘనంగా సత్కరించారు.

## ఏపి ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

● రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాన్స్ మాస్టర్ దిమ్మే రామకృష్ణ ఎంపిక



**కల్లూరు, జూలై 20:** ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కర్నూలు న్యూ పవర్ డ్యాన్స్ ఫిట్నెస్ అకాడమీ అధినేత దిమ్మే రామకృష్ణ ఎంపికయ్యారు. శనివారం తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యాలయంలో సినీ నిర్మాత రాజేంద్రప్రసాద్, న్యాయవాది దుర్గాభవాని సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూలు జిల్లా వాసి దిమ్మే రామకృష్ణను జిల్లా డ్యాన్స్ అసోషియోషన్ సభ్యులు ఆదోని రఘు, కల్లూరు మధు, శివ, నాగరాజు, సాగర్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

## తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వీఆర్వోలు

**సి. బెళగల్, జూలై 20:** సిబెళగల్ మండల తహసీల్దార్ అనుపమ బదిలీ కావడంతో శనివారం వీఆర్వోలు సన్మానించారు. ఎన్నికల ముందు ఇక్కడికి వచ్చానని, మండలంలోని సమస్యలు పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. విధుల పట్ల అంకిత భావంతో పని చేయాలని వీఆర్వోలకు సూచించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


విన్యాసాలు చేస్తున్న జాతీయ స్థాయి యోగా క్రీడాకారులు

**కర్నూలు(స్పోర్ట్స్), జూలై 20:** యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతోందని 41వ వార్డు కార్పొరేటర్ శ్వేతారెడ్డి అన్నారు. శనివారం జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో నగరంలోని అవుట్‌డోర్ స్టేడియం యోగా హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా టోర్నమెంటు కం సెలక్షన్‌ను కార్పొరేటర్ శ్వేతరెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా యోగా సంఘం చైర్మన్ శ్రీధర రెడ్డి, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి యోగాచార్య అవినాశ్ శెట్టి ప్రారంభించారు. అనంతరం జాతీయ స్థాయి యోగా క్రీడాకారులు ప్రదర్శించిన అడ్వాన్స్ యోగా విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 450 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం కోశాదికారి శ్రీధర్, జిల్లా యోగా సంఘం ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, సంయుక్త కార్యదర్శి సాయికృష్ణ, సభ్యులు శ్రీనివాసులు, మునిస్వామి, రమణమూర్తి, విజయకుమార్, లాలనప్రియ, కేశవ పాల్గొన్నారు.

## నేడు గురు పౌర్ణమి

**కర్నూలు (కల్చరల్), జూలై 20:** 'గురు పౌర్ణమి'ని ఆదివారం జిల్లా వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని షిరిడీ సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకుడు మాకా ఆశోక్‌కుమార్ తెలిపారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సరస్వతి నగర్‌లోగల శ్రీ శివదత్త సాయిబాబా మందిరంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బీవీ మల్లికార్జున రావు తెలిపారు. పాతనగరంలోని లలితాపీఠంలో వ్యాస పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజాదికార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మఠాధిపతులు, గురుస్థానంలో ఉన్న వారికి గౌరవంగా శాలువ, పుష్పమాలలతో సన్మాన, సత్కార, గురుపూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నటు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యాధ్యక్షుడు రమణ, మాళిగి భానుప్రకాశ్ తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 14 కేసులు నమోదు

**కర్నూలు, జూలై 20:** నగరంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి 14 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సుంకేసుల రోడ్డులోని సంజీవిని హాస్పిటల్ దగ్గర ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 ద్విచక్రవాహనదారులు, ఒక కారు డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు రుస్తామని సీఐ గౌతమి తెలిపారు.

## హత్య కేసులో నిందితుడు అరెస్టు

**కర్నూలు, జూలై 20:** టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్ఎస్ రోడ్డు సర్కిల్‌లో ఈ నెల 17వ తేదీ జరిగిన శ్రీరాములు ఆచారి అనే వ్యక్తి హత్య కేసులో నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు పరుశురామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మృతి చెందిన శ్రీరాములు ఆచారికి, ఫాతిమాకు కూతురు సంతానం. వీరిద్దరు విడిపోయారు. శ్రీరాములు ఫాతిమా కూతురుని నిందితుడు పరుశురాం వేధించేవాడు. ఈ నేపథ్యంలో ఫాతిమా, ఆమె రెండో ప్రియుడులు కలిసి పరుశురాంను మందలించారు. ఈ నేపథ్యంలో తనను మందలించడానికి కారణం శ్రీరాములే అని బావించిన పరుశురాం శ్రీరాములును రాయితో కొట్టి హత్య చేశాడని పోలీసులు తెలిపారు.

## తడకనపల్లెలో వనమహోత్సవం


విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్, సర్పంచు

**కల్లూరు, జూలై 20:** కల్లూరు మండలం తడకనపల్లెలో వనమహోత్సవంలో భాగంగా ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి గట్లపైన విత్తనాలు నాటారు. శనివారం ఏపీవో మద్దీశ్వరమ్మ ఆధ్వర్యంలో 2024-25 ఏడాదికి సంబంధించి బోడికొండలు, కాలువ గట్లపై సీడ్ డిబ్లింగ్(విత్తనాలు నాటుట) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు సహరాబీ, పొదుపు సంఘం నాయకురాలు జుబేదాబి తదితరులు పాల్గొన్నారు.

● **విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ:** బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తడకనపల్లె హైస్కూల్‌లోని విద్యార్థులకు మేనేజర్ హనుమంతయ్య ప్లేట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్న బోజన పథకాన్ని దృష్టిలో ఉంచుకుని 230 ప్లేట్లు సర్పంచు సహరాబీ, పొదుపు సంఘం నాయకురాలు జుబేదాబి ఆధ్వర్యంలో అందజేశారు. జనసేన నాయకుడు సలాం, కార్యదర్శి కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మత్యకారులు నదిలోకి వెళ్లవద్దు


మత్స్యకారులతో మాట్లాడుతున్న ఈవోఆర్డీ

**సి. బెళగల్, జూలై 20:** తుంగభద్రనదిలో వెళ్లరాదని గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, శింగవరం, కొత్తకోట గ్రామాలలో మత్యకారులకు ఈవోఆర్డీ సందీప్ శనివారం సూచించారు. ఈవోఆర్డీ మాట్లాడుతూ కర్ణాటక ఎగువ ప్రాంతం తుంగభద్రనది డ్యాంమ్ గేట్లు తెరువడంతో సిబెళగల్ మండలం నదితీరా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే నదితీరాన ఉన్న ఆయా గ్రామాలలోని మత్యకారులు చేపలు పట్టడానికి వెళ్లరాదన్నారు. అలాగే నదితీరా గ్రామాలకు నీటి సరఫరా చేసే సమయంలో వాటర్ ట్యాంక్‌లలో బ్లీచింగ్ పౌడర్‌ను కలిపి సరఫరా చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

## మూడో రోజు ఇద్దరు నామినేషన్లు


అడిషనల్ కమిషనర్‌కు నామినేషన్లు అందజేస్తున్న కార్పొరేటర్లు

**కర్నూలు(న్యూసిటీ), జూలై 20:** నగర పాలక సంస్థ సంఘ కమిటీ సభ్యుల ఎన్నికలకు మూడో రోజు ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం 12వ వార్డు కార్పొరేటర్ అన్నెపోగు క్రాంతికుమార్, 39వ వార్డు కార్పొరేటర్ బోయిన సాంబశివరావు తమ నామినేషన్ పత్రాలను అడిషనల్ కమిషనర్ పివి. రామలింగేశ్వర్‌కు అందజేశారు. మొదటి రోజు 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు నామినేషన్ల సంఖ్య మూడుకు చేరింది. అయితే ఆదివారం కూడ నామినేషన్లు స్వీకరిసాతమని అడిషనల్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సెక్రటరీ నాగరాజు, సీ3 క్లర్క్ జీఎం. శ్రీకాంత్ ఉన్నారు.

## ఎంపీ కేసీనేని చిన్నిని కలిసిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు


ఎంపీ కేసీనేని చిన్నిని కలిసిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

**కర్నూలు(అర్బన్), జూలై 20:** విజయవాడ ఎంపీ కేసీనేని చిన్నిని మర్యాద పూర్వకంగా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి పోగు బజారన్న కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్నూలులో ఆగిపోయిన భగవాన్ బాలసాయిబాబా క్రికెట్ గౌండ్స్‌ని పూర్తి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను భ్రష్టు పట్టించారని, వెంటనే స్టేడియం నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి జలీల్, బోగ్గుల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## అతిసార చిన్నారులను పరామర్శించిన డీఎంహెచ్‌వో

**కర్నూలు(హాస్పిటల్), జూలై 20:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్న పిల్లల వార్డులో శనివారం మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామానికి చెందిన డయేరియా చిన్నారులను డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. అతిసారతో చికిత్స పొందుతున్న దినేష్ (8), అభిరామ్ (5) చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత డిశ్చార్జ్ చేస్తామని, భయపడాల్సిన అవసరం లేదని వారి బంధువులకు తెలిపారు.

● నగరంలోని జోహరాపురం-2 పరిధిలోని కిందిగేరి సచివాలయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులకు 5 సంవత్సరాలలోపు పిల్లలకు టీకాలను సమయానుసారంగా వేయించాలని, ఆ వివరాలను మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేసి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

## మెడికవర్‌లో అరుదైన ఆపరేషన్


ఏడు నెలల శిశువుతో మెడికవర్ హాస్పిటల్ వైద్యులు

**కర్నూలు(హాస్పిటల్), జూలై 20:** ఏడు నెలల శిశువుకు తలకు బలమైన గాయం కావడంతో తల్లిదండ్రులు మెడికవర్ హాస్పెటల్‌కు తీసుకొచ్చారు. బెడ్‌పై నుంచి పడిపోవడంతో శిశువు తలకు గాయమై స్పృహ కోల్పోయి ఊపిరి తీసుకోవడం కష్టంగా మారింది. మెడికవర్ వైద్యులు తక్షణమే స్పందించి వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. సిటీ స్కాన్ పరీక్ష చేయగా.. అందులో మెదడులో శిశువుకు రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. వెంటనే శిశువును ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు. ఈ ప్రక్రియ జరుగుతుండగానే గుండె స్పందన నిలిచిపోవడం దానిని విజయవంతంగా పునరుద్ధరించి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. మెదడులో రక్తస్రావం ఆపారు. డాక్టర్లు విశ్వకుమార్, మురార్జి నేతృత్వంలో పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ టీం 24 గంటలు చికిత్స అందించినట్లు మెడికవర్ హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి తెలిపారు. నాలుగు రోజుల తర్వాత శనివారం వెంటిలేటర్‌ను తొలగించామని, శిశువు ఆరోగ్యంగా ఉండటంతో డిశ్చార్జ్ చేశామని తెలిపారు.

## అనస్థీషియా టెక్నీషియన్‌లకు ఆదరణ


నేషనల్ అనస్థీషియా టెక్నీషియన్ డే సందర్భంగా కేక్‌ను కట్ చేస్తున్న సూపరింటెండెంట్

**కర్నూలు(హాస్పిటల్), జూలై 20:** ఆధునిక వైద్య విధానంలో అనస్థీషియా టెక్నీషియన్‌లకు ఆదరణ పెరిగిందని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం జాతీయ అనస్థీషియా టెక్నీషియన్ల దినోత్సవం సందర్భంగా ఎమర్జెన్సీ మెడికల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి క్యాజువాల్టీలో ఆయన కేక్‌ను కట్ చేశారు. అత్యవసర రోగులకు, కోమాలో ఉన్న వారికి సీపీఆర్, శ్వాస తీసుకోలేని వారికి వెంటిలేటర్ కేర్ అందించడంలో అనస్థీషియా టెక్నీషియన్లు కీలక పాత్ర వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్టుమెంటు హెచ్‌వోడీ డా. రామశివనాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సుబ్రహ్మణ్యం, అనస్థీషియా ప్రొఫెసర్ డా. సుధీర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సోమశేఖర్, అనస్థీషియా టెక్నీషియన్లు దినేష్, భాస్కర్ రెడ్డి, అనిల్, చిన్న పాల్గొన్నారు.

## పూర్వ వైద్యవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



డాక్టర్ ప్రభాకర్ రెడ్డిని సన్మానిస్తున్న 1996 బ్యాచ్ విద్యార్థులు

**కర్నూలు(హాస్పిటల్), జూలై 20:** 1996 బ్యాచ్ పూర్వ వైద్య విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూలెక్చర్ గ్యాలరీలో జరిగింది. ఈ సందర్భంగా 1996 బ్యాచ్ పూర్వ వైద్యవిద్యార్థులు అనాటమి డిసెక్షన్ ల్యాబ్‌కు 3.60 లక్షలు విలువైన 5 ఏసీలను ఉచితంగా అందజేశారు. అనంతరం తమకు విద్య నేర్పిన 25 మంది గురువులను సన్మానం చేశారు. సీనియర్ ప్రొఫెసర్లు సుధాకర్‌రావు, మాలకొండయ్య, ప్రభాకర్ రెడ్డి, జి.సుధాకర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ వైద్యవిద్యార్థులు ఆర్థోసర్జన్ రాజయ్య, వైద్యులు హరికిషన్, అయూబ్, సత్యనారాయణ, మల్లేశ్వరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## జాతీయ రహదారి హంద్రీనదిపై దెబ్బతిన్న బ్రిడ్జి



హంద్రీనదిపై నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**కల్లూరు, జూలై 20 :** కల్లూరులోని జాతీయ రహదారిపై ఉన్న హంద్రీనది బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉన్నా, రహదారి నిర్వహణ సంస్థ, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పట్టణ పౌర సంక్షేమం సంఘం నాయకుడు ఇరిగినేని పుల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హంద్రీనది బ్రిడ్జిపై పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ మరమ్మతుల పేరుతో నెలల తరబడి వాహనాలను దారి మళ్లిస్తున్నారని, దీంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారన్నారు. జాతీయ రహదారులకు ఇరువైపులా సర్వీసు రోడ్ల నిర్మాణంతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండి యూనస్, సివి.వర్మ, ఎస్‌కె.షబ్బీర్, కె.శ్రీనివాసులు, నయూమ్, రహిమాన్ పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

● ట్రాన్స్‌కో ఏఈ గోవిందు



మంత్రాలయంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏఈ గోవిందు

**మంత్రాలయం, జూలై 20:** విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ గోవిందు అన్నారు. శనివారం తుంగభద్ర విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారులు పాటించాల్సిన భద్రతపై సమావేశం నిర్వహించారు. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, సపోర్టు వైర్లు, విద్యుత్ శాఖకు తెలియకుండా లైన్లను ఏర్పాటు చేసుకోవడం, ఇంట్లో వైర్లు, స్విచ్‌లు, ఫోల్డర్, ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన వాటిని వినియోగించాలని, తడి చేతులతో తాకరాదని సూచించారు. రైతుల పొలాల్లో బోర్లను ఆన్ చేయకూడదని, వీధి దీపాలు కొబ్బరి చెట్లు, డాబాల్లోని రేకుల షెడ్లలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో భీమయ్య, రాజశేఖర్, రంగస్వామి, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

● **పెద్దకడుబూరు:** విద్యుత్ ప్రమాదాలపై అవ గాహన కలిగి ఉండాలని ఏఈ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పెద్దకడుబూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రజలు, రైతులకు విద్యుత్ వినియోగం, ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ విద్యుత్ వైర్లు కిందపడి ఉన్నా, స్తంభాలు పడిపోయినా, వైర్లు నేలరాలినా వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందజేయాలన్నారు.

● **మద్దికెర:** వర్షాకాలం కాబట్టి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని మండల విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ అన్నారు. శనివారం మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలపై కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత వైరింగ్‌కు ఐఎస్ఐ గుర్తింపు కలిగిన వాటిని ఉపయోగించాలన్నారు. ఎర్తింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది రామచంద్ర, తదితరులు ఉన్నారు.

● **తుగ్గలి:** కరెంటు వాడకంలో జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ ఏఈ మహేశ్వరరెడ్డి అన్నారు. శనివారం



రైతులతో మాట్లాడుతున్న ఏఈ సుబ్బారెడ్డి

మండలంలోని తుగ్గలి, జొన్నగిరి తదితర గ్రామాల్లో విద్యుత్ ఏఈతో పాటు అన్ని లైన్‌మెన్లు, సిబ్బంది పర్యటించి విద్యుత్ సరఫరాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ గోడపత్రికలను అంటించారు. కార్యక్రమంలో ఏఈలు రామదాస్, నాయక్ పాల్గొన్నారు.



## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

**గోనెగండ్ల, జూలై 20:** గోనెగండ్ల పాత బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడ లేకపోవడం, దాని చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు మొలకెత్తడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అర్థం కావడం లేదని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు పెరగడంతో మూగ జీవాలు వాటిని తినేందుకు వెళ్లి ప్రమాదం బారి పడే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రైళ్లను మద్దికెర స్టేషన్‌లో ఆపాలి



గుంతకల్లు డీఆర్ఎంకు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

**మద్దికెర, జూలై 20:** మద్దికెర నుంచి కర్నూలు వరకు ప్యాసింజర్ రైళ్లు తిరగడం లేదని, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, తాలుకా సీనియర్ టీడీపీ నాయకులు, రిటైర్డు ఉద్యోగి నగిరి కిష్టన్న యాదవ్ కోరారు. శనివారం గుంతకల్లు డీఆర్ఎం విజయకుమార్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దికెర రైల్వేస్టేషన్‌లో మూడేళ్ల నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లను అమరావతి, కాచిగూడ, యశ్వంత్‌పూర్ రైళ్లను నిలపడం లేదని అయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మద్దికెర నుంచి కర్నూలు, కాచిగూడ, డోన్, విజయవాడ ప్యాసింజర్ రైళ్లు తిరగకపోవడం వల్ల రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు గద్దం రామాంజులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పారా విరోబ, సాయినగర్ బాషా పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చదువు చెప్పడం లేదు



మాట్లాడుతున్న సాంబగల్లు సర్పంచు సువర్ణ

**ఆదోని రూరల్, జూలై 20:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదువు చెప్పడం లేదని సాంబగల్లు సర్పంచ్ సువర్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ భవన్‌లో ఎంపీపీ బడాయి దానమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కూటమి ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ అరుణ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబగల్లు సర్పంచు సువర్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా ఉపాధ్యాయులు సక్రమంగా చదువు చెప్పడం లేదని అన్నారు. కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలకు వచ్చి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా చూడాలని, ప్రభుత్వ అధికారులు విధిగా వారి ఉద్యోగాన్ని చేయాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో డీసీఎస్‌హెచ్ విచారణ



ప్రభుత్వ వైద్యశాలలో విచారణ చేస్తున్న డీసీఎస్‌హెచ్ మాధవీలత

**ఎమ్మిగనూరు, జూలై 20:** ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలలో డీసీఎస్‌హెచ్ మాధవీలత శనివారం విచారణ నిర్వహించారు. గత కొన్ని రోజుల క్రితం ప్రభుత్వ వైద్యశాలలోని నిరుపయోగంగా ఉన్న (స్ర్కాప్) సామగ్రిని అనుమతులు లేకుండ స్థానిక సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. అలాగే ఆస్పత్రి సిబ్బంది రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఇందుకు స్పందించిన ఉన్నతాధికారులు విచారణ చేయాలని డీసీఎస్‌హెచ్ మాధవీలతను ఆదేశించారు. ఈ మేరకు ఆమె ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

## ఇళ్ల నిర్మాణాల్లో భారీ అవినీతి

**ఆదోని, జూలై 20 :** ఇళ్ల నిర్మాణాల్లో భారీ అవినీతి జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శనివారం హౌసింగ్ పీడీ సిద్దలింగ మూర్తి, డీఈ రవి కుమార్‌లతో కలిసి జగనన్న కాలనీలోని ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి గూడు ఉండాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణాలను చేపట్టిందన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం నాసిరకంగా ఎక్కడ పడితే అక్కడ నిర్మాణాలు చేపట్టిందని తెలిపారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వారి అనుచరులు రైతుల నుంచి ఎకరా రూ.5 లక్షలకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి రూ.13 నుంచి 15లక్షల వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. విచారణ చేయించి అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, నాగరాజు గౌడ్, ధర్మేంద్ర, రవి, సాయి పాల్గొన్నారు.

# డీఐజీని కలిసిన నాయకులు



కర్నూలు రేంజ్ డీఐజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న తిక్కారెడ్డి, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

**పత్తికొండ, జూలై 20:** కర్నూలు రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కోయ ప్రవీణ్‌తో పాటు ఎస్పీ బిందుమాధవ్‌లను టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ముందుగా డీఐజీని కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆయనతో మాట్లాడారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

## కలెక్టర్‌ను కలిసిన నాయకులు

**మంత్రాలయం, జూలై 20:** కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ పి.రంజిత్ బాషాను, ఎస్పీ జి.బిందుమాధవ్‌లను మంత్రాలయం నాయకులు శనివారం కలిశారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ నాయకులు ఎన్.రాఘవేంద్రరెడ్డి వేర్వేరు సమయాల్లో ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసి పూలబొకేను అందజేసి సన్మానించారు. నియోజకవర్గంలోని సమస్యలను, తాగునీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీలు, శాంతిభద్రతల అదుపు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం రాఘవేంద్రస్వామి మెమెంటో, పట్టు శాలువా, పుష్పగుచ్ఛం ఇచ్చి వారిని సత్కరించారు. కార్యక్రమంలో గురెడ్డి భీమిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, టీడీపీ నాయకులు రాకేష్ రెడ్డి ఉన్నారు.



ఎస్పీ బిందు మాధవ్‌కు పూలబొకే ఇస్తున్న టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి

## రసం పీల్చే పురుగును నివారించొచ్చు

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి

**గోనెగండ్ల, జూలై 20:** రైతులు రసం పీల్చే పురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి కోరారు. శనివారం మండల పరిధిలోని వేముగోడు, పుట్టపాశం, గోనెగండ్ల గ్రామాలలోని వేరుశనగ, పత్తి, కంది పంటలను సాగు చేసిన పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు జేడీ వరలక్ష్మి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటకు రసం పీల్చే పురుగు సోకిందని అందుకు గాను వేపనూనె ఐదు మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని అన్నారు. తర్వాత ప్రొఫైనోఫాస్ రెండు మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. వేరుశనగ పంటలో ఇనుము ధాతు లోపం నివారణకు ఫెరస్ సల్ఫేట్ పది గ్రాములు ఒక లీటరు నీటిలో కలుపుకొని పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని అన్నారు. అనంతరం వేముగోడులో కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో హరి, గ్రామ వ్యవసాయశాఖ సహాయకులు షఫి, మణి, జాకీర్ పాల్గొన్నారు.

### వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలి

అంటువ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని గోనెండల మండల ప్రత్యేక అధికారి జేడీ వరలక్ష్మి పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. శనివారం వేముగోడు గ్రామంలో పర్యటించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫాతిమా, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

## పడగొట్టి పట్టించుకోలేదు..

**మద్దికెర, జూలై 20:** మండలంలోని పెరవలి గ్రామంలోని సిలారమ్మ కోటలో ఎన్నో ఏళ్లుగా ఎంపీపీ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు మొత్తం 65 మంది విద్యార్థులు చదువుకునేవారు. 2023లో రెండో విడత నాడు-నేడు కింద ఈ పాఠశాల మంజూరైందంటూ అధికారులు, వైసీపీ నాయకులు కలిసి పాఠశాలను పడగొట్టి బేస్‌మటం వరకు కట్టి వదిలేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. పాఠశాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి తెలిపారు.



పెరవలిలో పడగొట్టిన ప్రభుత్వ పాఠశాల ఇదే..

## మండల అభివృద్ధికి కృషి చేయాలి



కేఈ కృష్ణమూర్తి, కేఈ శ్యాంబాబును సత్కరిస్తున్న నాయకులు

**తుగ్గలి, జూలై 20:** తుగ్గలి మండలం అభివృద్ధి కోసం కృషి చేయాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, మైనార్టీ సెల్ నాయకులు మాబాషాలు కోరారు. శనివారం కర్నూలులో మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి దంపతులతోపాటు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి తిరుపతి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించి సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తిన లోకేశ్, అక్బర్, తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

**ఎమ్మిగనూరు రూరల్, జూలై 20:** రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ కార్యాలయంలో తాలుకా అధ్యక్షుడు మాలిక్ అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 29, 30, 31వ తేదీల్లో మదనపల్లెలో రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పాలకుల విధానాల కారణంగా రైతులు, కౌలు రైతులు, చేతివృత్తిదారుల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సంక్షోభానికి మూలకారణాలు విశ్లేషించి రైతుల ఆత్మహత్యలు నివారించాలన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారస్సులను అమలు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు నిలుపుదల చేయాలని కోరారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు, విద్యుత్, పెట్రోల్ ఉత్పత్తులు ట్రాక్టర్ సంబంధిత వాహనాలపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనానికి అందరూ పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు, బీటీ చిన్నన్న, శాంతప్ప, విరుపాక్షి నాయుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, గిడ్డయ్య, నాగప్ప, ఇస్మాయిల్, జయరాము, హనుమంతు, శ్రీరాములు, వీరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

## కౌలు కార్డులు పొందాలి

**మద్దికెర, జూలై 20:** కౌలు కార్డులు తప్పకుండా పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఉప్పర రవి, డిప్యూటీ తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, మాజీ జడ్పీటీసీ సభ్యులు, సీనియర్ టీడీపీ నాయకులు జమేదార్ రాజన్న యాదవ్ అన్నారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పర రవి మాట్లాడుతూ కౌలు రైతులు కార్డులు తీసుకోవడం వల్ల భూ యజమానులకు ఎటువంటి నష్టం జరగదన్నారు. కౌలు కార్డు చెల్లుబాటు కాలం 11 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, వ్యవసాయ సిబ్బంది జాకీర్, ఆనంద్, రాణి, రైతులు పాల్గొన్నారు.

## ఉరుకుందలో కొనసాగిన వేలం పాటలు

**కౌతాళం, జూలై 20:** ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో శనివారం వివిధ పనులకు వేలం పాటలను ఆలయ అధికారులు నిర్వహించారు. ఇందులో ప్రముఖంగా ఆలయానికి ఆదాయాన్ని సమకూర్చే టెంకాయల సరఫరా, కొబ్బరి చిప్పలను పోగు చేసుకునే హక్కులకు ఆన్‌లైన్ టెండర్లు, బహిరంగ వేలం పాటలకు ఎవరూ ముందుకు రాలేదు. సీల్డ్ టెండర్లలో ఇద్దరు పాల్గొనగా ఉరుకుందకు చెందిన కాకమ్మగారి ముత్తన్న రూ.64,00,062తో ఎక్కు పాటదారుడిగా నిలిచారు. దేవాలయానికి పేపర్ రోల్స్ సరఫరాకు ఇద్దరు కోడ్ చేయగా వైభవ్ బుక్ సెంటరు వారు తక్కువకు కోడ్ చేసి టెండరును దక్కించుకున్నారు. విద్యుత్ పరికరాల సరఫరా, ప్లంబింగ్ పనులకు ఇద్దరు కోడ్ చేయగా అందులో ప్రసాద్ అను పాటదారుడు తక్కువ ధరకు కోడ్ చేసి టెండరు దక్కించుకున్నారు. నప్ల యర్స్ సామనుల సరఫరాను ఉరుకుందకు చెందిన వీరేష్, వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను వీరాంజనేయులు దక్కించుకున్నారు. మొబైల్ టాయిలెట్‌కు ఇద్దరు టెండరు దాఖలు చేయగా పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డీసీ మరియు ఈఓ వెంకటేష్, ఆదోని దేవదాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, కోసిగి, మంత్రాలయం సీఐలు ప్రసాద్, ఏరిషావలి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డిలు బందోబస్తు నిర్వహించారు.

## కుష్ఠు వ్యాధి ప్రాణాంతకం కాదు

**మద్దికెర, జూలై 20:** కుష్ఠు వ్యాధి ప్రాణాం తకం కాదని, మందులతో నివారించవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. శనివారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై సర్వే ఉంటుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలను తెలియజేశారు.

## న్యాయం చేయాలి

**తుగ్గలి, జూలై 20:** టీడీపీ గెలుపు కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకునికి న్యాయం చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు వెంకటస్వామి, యువ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్, వీరశైవ లింగాయత్ రాష్ట్ర నాయకులు కౌశిక్ కుమార్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హామీ ఇచ్చారని తెలిపారు.



## ముగిసిన దుకాణాల వేలాలు

**పత్తికొండ, జూలై 20:** పత్తికొండ మార్కెట్ యార్డులో నిర్మించిన 16 దుకాణాలకు సంబంధించిన వేలాలు ముగిశాయని కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటలో 11మంది రూ.10 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొన్నారన్నారు. గరిష్ఠంగా రూ3.550, కనిష్ఠంగా రూ.1,550 చొప్పున దుకాణాలు వ్యాపారులకు అద్దెకు కేటాయించామని చెప్పారు. జిల్లా అధికా రుల ఆదేశాల మేరకు నిర్వహించిన వేలాలను నిబంధనల మేరకు పూర్తి చేశామన్నారు.

## అభివృద్ధికి కృషి చేయాలి

**పత్తికొండ టౌన్, జూలై 20:** పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు అన్నారు. ఓ లేఖ ద్వారా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు సమ స్యలను వివరించారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్, బాలిక సంరక్షణకు వసతి గృహాలు, అన్న క్యాంటీన్లు, స్వచ్ఛమైన తాగునీరు, పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని కోరారు. పందికోన రిజర్వాయర్ ద్వారా పంటలకు నీరు అందించాలని లేఖలో కోరారు.

## జాగ్రత్తలు తీసుకోవాలి

**నందవరం, జూలై 20:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కిరణ్ మోహన్, ఈవోపీఆర్డీ ఈశ్వరయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆర్ఐ జర్మియా సచివాలయ సిబ్బంది రుక్మాన్, ముగతి రఘు, ముగతి శేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

**నందవరం, జూలై 20:** మండలంలోని తుంగభద్ర తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఓబులేసు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ తీర గ్రామాలైన నదికైరవాడి, గంగవరం, జోహరాపురం, పెద్ద కొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురుజాల, రాయచోటి గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలు అలర్ట్‌గా ఉండాలని సూచించారు.

**కౌతాళం:** నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి అన్నారు. తుంగభద్ర డ్యాంకు వరద వచ్చి చేరుతున్నదని, నదీతీర గ్రామాలైన మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు, మరళి, గుడికంబాలి, వల్లూరు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సద్వినియోగం చేసుకోండి

**పత్తికొండ, జూలై 20:** ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై అందించే మినీ గోకులాలను పశు పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఏడీ రవిప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన వివరాలను వెల్లడించారు. పశువుల పెంపకందారులకు మినీ గోకులాలు అందిస్తామ న్నారు. పశుపెంపకందారులు సమీపంలోని పశువైద్యశాలలో లేదా రైతు సేవా కేంద్రాలలో సంప్రదించి పూర్తి వివరాలు పొందవచ్చన్నారు.

## ఎంఈఓ-1ను నియమించండి

**కౌతాళం, జూలై 20:** కౌతాళం ఎంఈఓ-1ను నియమించాలని ఏపీటీఎఫ్ మండల నాయకులు హనుమంతరెడ్డి, హర్షద్‌లు అన్నారు. శనివారం ఎంఈఓ-2 శోభారాణికి వినతి పత్రం ఇచ్చారు. ఎంఈఓ-1 లేకపోవడంతో ఉపాధ్యాయుల జీతాలు చేసే వారు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకుపోవాలని కోరారు.

## ప్రధాన డ్రైన్‌లలో పూడికతీత

**ఎమ్మిగనూరు టౌన్, జూలై 20:** ఎమ్మిగనూరు పట్టణంలో ప్రధాన డ్రైన్‌లలో శనివారం పూడికతీత పనులను చేపట్టారు. కమిషనర్ గంగిరెడ్డి పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. మురుగు నీరు రోడ్లపైకి రాకుండా పూడికతీత పనులను ప్రారంభించామని అన్నారు. అలాగే అన్న క్యాంటిన్‌ల పనులను పరిశీలించారు. ఈ నెల 31వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ నీరజ, ఏఈ మదన్ కుమార్ పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చూడాలి

**పత్తికొండ టౌన్, జూలై 20:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ మాధవ రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని హోసూరు గ్రామంలో వివిధ శాఖల అధికారులతో తహసీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం దోమల నివారణకు మందును పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మునిస్వామి పాల్గొన్నారు.

## గ్రామాల్లో అధికారుల పర్యటన

**వెల్దుర్తి, జూలై, 20:** వర్షాలు కురుస్తున్నందున డయేరియా, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి తులసీ అన్నారు. శనివారం పుల్లగుమ్మి గ్రామంలో పర్యటించారు. అదేవిధంగా అల్లుగుండు గ్రామంలో ఎంపీడీవో శివశంకరప్ప, గోవర్ధనగిరి గ్రామంలో తహసీల్దార్ అనంత ఆచారి పర్యటించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## కర్ణాటక మద్యం పట్టివేత

**ఎమ్మిగనూరు టౌన్,జూలై 20:** మంత్రాలయం మండలంలోని రాంపురం గ్రామానికి కిలోమీటరు దూరంలో గల పంప్ హౌస్ వద్ద కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సెబ్ అధికారులు సీజ్ చేశారు. ఈ మద్యం మార్కెట్‌లో దీని విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

## కాపర్‌వైరు చోరీ

**ఎమ్మిగనూరు రూరల్, జూలై 20:** మండల పరిధిలోని రాళ్లదొడ్డిలో శుక్రవారం అర్ధరాత్రి కొందరు దొంగలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైర్‌ను చోరీ చేశారు. చెరుకురాళ్ల తిమ్మప్ప దేవాలయం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఈ చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు.

## మంత్రాలయంలో బెంగళూరు వాసి మృతి

**మంత్రాలయం, జూలై 20:** మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన బెంగళూరుకు వాసి ప్రభు కుమార్ (55) మంత్రాలయం ఆర్టీసీ బస్టాండ్‌లో మృతి చెందినట్లు ఎస్ఐ గోపీనాథ్ తెలిపారు. శుక్రవారం రాత్రి బెంగుళూరు నుంచి బస్సులో మంత్రాలయానికి వచ్చి కేఎస్ ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ వద్ద నిద్రించాడు. నిద్రలోనే ఆయన మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చారు. ప్రభుకుమార్ భార్య రెండేళ్ల క్రితం చెందగా, ఉన్న ఒక్క కుమార్తె మలేషియాలో ఉన్నట్లు తెలిపారు. మృతదేహన్ని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.